క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009–10 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా నాటి మధుర స్మృతులను గుర్తుచేసున్నారు.

‘సీతారామ’ నీటితో చెరువులు నింపండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా సీతారామ ప్రాజెక్ట్ నీటిని మళ్లించాలని రాష్ట్ర సాగునీటి మంత్రి నల్లమల్ల ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలలోని, కుంటలు, చెరువులకు నీళ్లు మళ్లించాలని మంత్రిని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎల్వీ ఆశయ సాధనకు పోరాడుదాం..

ఇల్లెందు: ఇఫ్టూ జిల్లా నేతగా సుదీర్ఘకాలం కార్మికుల హక్కుల కోసం తుది వరకు పోరాడిన నేత ఎల్.విశ్వనాథం అని ఇఫ్టూ జిల్లా నాయకులు కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఇల్లెందులోని సీఎస్‌పీ వద్ద జరిగిన కార్యక్రమంలో విశ్వనాథం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈ నెల 9న జిల్లా కేంద్రంలో జరగనున్న విశ్వనాథం సంతాపసభను విజయవంతం చేయాలని కోరారు.

డ్రైయినేజీల నిర్మాణం అస్తవ్యస్తం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి 4వ వార్డు ఇందిరమ్మ కాలనీలో మున్సిపల్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా డ్రైయినేజీల నిర్మాణం చేస్తున్నారని, అక్కడి స్థానికులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. పలుకుబడి ఉన్నవారికి అనుకూలంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వీధుల్లో నిబంధనల ప్రకారం డ్రైయినేజీల నిర్మాణం చేయాలని కోరారు.

పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయండి..

కొత్తగూడెంఅర్బన్: గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో బి.కిశోర్‌సింగ్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బదిలీల షెడ్యూల్ విడుదల చేయకపోవడంపై ఉపాధ్యాయులు ఆందోళనగా ఉన్నారని, వెంటనే విడుదల చేయాలని కోరారు.

పెన్షన్ లేకుండా పంపించడం తగదు

సూపర్‌బజార్(కొత్తగూడెం): 40 ఏళ్లు పనిచేయించుకుని పెన్షన్ లేకుండా తక్కువ రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వడం సరైంది కాదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు, జిల్లా కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద 65 సంవత్సరాలు నిండిన అంగన్‌వాడీలు చేపట్టిన రిలేదీక్షలను రెండో రోజైన ఆదివారం వారు ప్రారంభించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

ఆటోలకు ఆదరణ కరువు..

- అగమ్యగోచరంగా డ్రైవర్ల బతుకులు
- ఆర్టీసీ బస్సుల్లోనే మహిళల ప్రయాణం
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు



సుజాతనగర్ మండల కేంద్రంలో ప్రయాణికుల కోసం వేచి ఉన్న ఆటోలు

సుజాతనగర్: కొత్తగూడెం జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు 25 ఏళ్లుగా ఆటో నడుపుకుంటూ పలువురు జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు రోజంతా నడిపితే రూ.600 నుంచి రూ.1000 వరకు మిగిలేవి. కానీ ప్రస్తుతం రూ.500 కూడా మిగలడం లేదని పలువురు డ్రైవర్లు వాపోతున్నారు. ఆటోలనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న మమ్ములను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది.

దీంతో ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలకు ఆదరణ తగ్గిపోయింది. మహిళలు కుటుంబంతో సహా కిక్కిరిసి మరీ బస్సు ప్రయాణాలే చేస్తున్నారు. ఆటోలవైపు ముఖం చాటేయడంతో వీరి ఆదాయం గణనీయంగా తగ్గింది. దీంతో ఆటోలనే నమ్ముకొని జీవిస్తున్న డ్రైవర్ల బతుకులకు భరోసా లేకుండా పోయింది

1000కి పైగా ఆటోలు..

సుజాతనగర్ మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు వెయ్యి వరకు ఆటోలు ఉన్నాయి. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు, జిల్లా కేంద్రానికి నిత్యం ప్రయాణికులకు వారి గమ్యస్థానాలకు చేరుస్తూ ఉపాధి పొందేవారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తీసుకురావడంతో మహిళలు బస్సు ప్రయాణం వైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఆటోలకు పూర్తిగా ఆదరణ తగ్గింది. ఆర్టీసీ బస్సులు తిరిగే రూట్లలో ప్రయాణికులు ఆటోల వైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రస్తుతం డీజిల్ ఖర్చు పోగా రోజుకు రూ.500 కూడా మిగలడం లేదని డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు.

దీంతో ఆటోల నిర్వహణ, ఫైనాన్స్ కట్టలేకపోతున్నామని, కుటుంబ పోషణ గడవడం లేదని వాపోతున్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏదైనా సంక్షేమ పథకాన్ని అమలు చేయాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

ఖర్చులు కూడా రావడం లేదు...



25 ఏళ్లుగా ఆటో నడుపుతున్నా. ఒకప్పుడు రోజుకు రూ.600 – 1000 వరకు మిగిలేవి. ప్రస్తుతం రూ.500 కూడా మిగలడం లేదు. ఇది నా ఒక్కడి పరిస్థితే కాదు.. ఆటోలనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న వేలాది మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి.

– కొల్లోజు వెంకటేశ్వర్లు

ట్రిప్పులు పడడం లేదు...



మహిళలు ఆటోలు ఎక్కేందుకు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉండటంతో కటుంబంతో సహా బస్సుల్లోనే వెళ్తున్నారు. దీంతో ట్రిప్పులు పడటం చాలా కష్టంగా మారింది.

– భూక్యా నరేష్, మంగ్రితండా

బస్సుల్లోనే వెళ్తున్నారు..



రోజంతా కష్టపడి ఆటో నడిపితే కనీసం రూ. 500 కూడా మిగలడం లేదు. ఆటోల్లో మహిళలు అస్సలు ఎక్కడం లేదు. ఎంత ఆలస్యమైనా వేచి చూసి బస్సుల్లోనే వెళ్తున్నారు. దీంతో మాకు ఆదాయం రావడం లేదు.

– బి.అనిల్‌కుమార్, సుజాతనగర్

కార్మికులు గ్రూప్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే కిన్నెరసాని కార్మికులు తప్పనిసరిగా గ్రూప్ ఇన్సూరెన్స్ చేసుకుంటే మీకు మీ కుటుంబ సభ్యులకు ఉపయోగకరంగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో కిన్నెరసాని కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాషా మాట్లాడుతూ... కార్మికులు సంఘటితంగా ఉంటే ఏ సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని, కార్మికులు ఐక్యంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా కార్మికులకు ఏఐటీయూసీ అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కంచర్ల జమలయ్య, నగేష్, కోల్హాపురి ధర్మరాజు, మహమ్మద్ యూసఫ్, శ్రీను, పల్లపోతు సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేయాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సుమారు 60 వేల మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని, సీఎం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

ఇల్లెందు: ఇల్లెందు – గుండాల రోడ్డులో గోవింద్ సెంటర్ నుంచి 21 ఫిట్ ఏరియా వరకు రోడ్డు వెడల్పు పనులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఆదివారం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండగా పరిశీలించిన ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. డివైడర్, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీటితో పాటు సత్యనారాయణపురం, ఆర్అండ్ఆర్ కాలనీ రోడ్, లైటింగ్, లలిత కళామందిర్ రోడ్ పనులను పరిశీలించారు.

మాజీ అధికారిపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న మల్లేష్ యాదవ్

ఇల్లెందు: కారేపల్లి ప్రాంతానికి చెందిన ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్ నాయక్ అకృత్యాలకు అదుపు లేకుండా పోయిందని, ఆయన వల్ల అక్కడి పచ్చిపాల భద్రయ్య అనే గిరిజనేతరుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఇల్లెందు యాదవ సంఘం ఆరోపించింది. ఆదివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో సంఘం పట్టణ అధ్యక్షుడు మేకల మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ... దొంగపత్రాలు సృష్టించి భద్రయ్య భూమిని ఆక్రమించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని, శంకర్ నాయక్ మీద చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వేశ్వరరావు యాదవ్, నిమ్మల రాములు, వరప్రసాద్ యాదవ్, ప్రభునాథ్‌యాదవ్, యాదగిరి యాదవ్, భద్రం, రాజేందర్ యాదవ్, శివ యాదవ్ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రద్దు చేయండి..



ఇల్లెందు: దీక్ష చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఇల్లెందు: బొగ్గు బావుల వేలంపాటను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట రెండో రోజు ఆదివారం దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.. దేశంలోని సహజ వనరులను కార్పొరేటీకరణ చేయటంలో కాంగ్రెస్ కూడా శ్రామికవర్గ వ్యతిరేక స్వభావాన్నే ప్రదర్శిస్తోందన్నారు. బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని విరమించుకుని నాలుగు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు దాసరి రాజారామ్, దేవరకొండ శంకర్, సుందర్, లచ్చిరామ్, భూషణం, శ్రీనివాస్, యాకుబ్‌పాషా, తిరుమలరావు, షబ్బీర్, రవి, కొమురయ్య, కౌన్సిలర్ కుమ్మరి రవీందర్ పాల్గొన్నారు.

బొగ్గు బావులను సింగరేణికి అప్పగించాలి...

కేంద్ర ప్రభుత్వం తక్షణం బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవాలని ఎంఎల్ మాస్‌లైన్ అనుబంధ ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులోని మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఐక్యపోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెల వెంకటేశ్వర్లు, పాయం వెంకన్న, గురునాథం, వీరన్న పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం అని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని అయ్యప్పనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పొంగులేటి క్యాంప్ కార్యాలయాన్ని కొత్వాల ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఐదింటిని నెరవేర్చారన్నారు. కొత్తగూడెం నియోజక వర్గానికి రూ.450 కోట్లతో బైపాస్ రోడ్డు మంజూరు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతనంగా మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియామకమైన కొత్వాలను పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొండం వెంకన్న, జాలే జానకిరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, ఎస్‌ఏ జలీల్, బద్ది కిశోర్, సాధం రామకృష్ణ, ఎస్వీ ఆర్‌కే ఆచార్యులు, కాల్వ భాస్కర్‌రావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకటాచారి, నారాయణ, నాగరాజు, సురేష్, శివారెడ్డి, చాంద్ పాషా, రాము, నరసింహారావు, జోషి, శ్రీలతా రెడ్డి, అరుణ, పాపారావు, మహేష్, సత్యం, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో, రెడ్ కార్డుల ఉత్తర్వులు రద్దు చేయండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం జారీ చేసిన ఎల్లో, రెడ్ కార్డుల ఉత్తర్వులు రద్దు చేయాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) జనరల్ సెక్రటరీలు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఉత్తర్వుల వలన కార్మికులు కంపెనీలో పనిచేసే పరిస్థితి లేదని, విధి నిర్వహణలో భయభ్రాంతులకు గురవుతున్నారని, వెంటనే ఎల్లో, రెడ్ కార్డ్‌లను రద్దు చేయాలని యాజమాన్యానికి విన్నవించారు. అప్రకటిత నిర్బంధం ప్రయోగించే ఈ సర్క్యులర్ రద్దు చేసేందుకు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు బాధ్యత వహించాలని కోరారు. ఈ సర్క్యులర్ పేరుతో కార్మికులకు చార్జీషీట్లు, సస్పెండ్ల పేరుతో ఉద్యోగాల నుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తోందని పేర్కొన్నారు. దీన్ని వెంటనే రద్దు చేయాలని లేని పక్షంలో యూనియన్ల ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి



కొత్తగూడెంటౌన్: దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ..

సింగరేణి(కొత్తగూడెం): ఎంతో భవిష్యత్ ఉన్న ఎస్సై శ్రీనివాస్ మృతి బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. అశ్వారావుపేట ఎస్సై శ్రీనివాస్ మృతిపై ఆదివారం ఆయన స్పందించారు. మాట్లాడుతూ.. ఆయన మృతి పట్ల సీపీఐ జిల్లా సమితి తరుపున సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. ఎస్సై కుటుంబాన్ని ప్రభుత్వం, పోలీసుశాఖ అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణం రామవరం సెంటర్‌లో ఆదివారం రాత్రి దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్‌ను మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాల మహానాడు, దళిత సంఘాల నాయకులు పాల్గొని ఎస్ఐ కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. డాక్టర్ సంజీవరావు, జెట్టి మోహన్, దాసరి ఆశోక్, రంగారావు, సీతారామరాజు తదితరులుపాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: అశ్వారావుపేట మండలం ఎస్సై శ్రీరాముల శ్రీనివాసు మృతి చెందడం బాధాకరం అని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ నేషనల్ కోఆర్డినేటర్ చార్వాక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలను రక్షించాల్సిన రక్షక భటుల వ్యవస్థ, మరో రక్షక భటున్ని బలి తీసుకోవడం విచారకరమని పేర్కొన్నారు. శ్రీనివాస్ మృతికి కారణమైన పోలీస్ అధికారులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జూలూరుపాడు: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జూలూరుపాడులో దళిత సంఘాల నాయకులు నల్లబ్యాడ్జిలు ధరించి, నిరసన తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ సెంటర్ వద్ద ఎస్సై చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు మాట్లాడుతూ.. ఎస్సై శ్రీనివాస్ మరణ వాంగ్మూలంలో పేర్కొన్న వారందరిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేల్పుల నరసింహారావు, మోదుగు రామకృష్ణ, పోతురాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: అశ్వారావుపేట ఎస్ఐ శ్రీనివాస్ మృతికి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఐతోపాటు నలుగురు కానిస్టేబుళ్లను తొలగించాలని, ఎస్ఐ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 కోట్ల సహాయం ఇవ్వాలని, ఎస్ఐ సతీమణికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలుగా ఆదుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టేకులపల్లి: వేధింపుల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్లశ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో టేకులపల్లి మండల కేంద్రంలో ఎస్ఐ మృతికి సంతాపం తెలిపారు.

పిల్లర్ల దశలోనే ‘డబుల్’ ఇళ్లు

- కథ కంచికి.. నిధులు నీళ్లపాలు
- పునాదులు దాటని పేదల పక్కా ఇంటి పథకం
- నియోజకవర్గానికి రూ. 20 కోట్లతో 400 ఇళ్లు



పిల్లర్ల దశలోనే నిలిచిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. అయితే గత ప్రభుత్వం హయాంలో అమలులో ఉన్న డబుల్ బెడ్ ఇళ్ల పథకం కథ కంచికేనా..? రూ.20 కోట్ల నిధులు నీటి పాలేనా..? సకాలంలో పూర్తి చేస్తే పేదలకు ఉపయోగపడేవి. గత ప్రభుత్వంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో నియోజకవర్గానికి రెండుసార్లు ఇళ్లు మంజూరు చేసింది. మొదటి దఫా ఎమ్మెల్యేగా ఉన్న కోరం కనకయ్య 70 శాతం ఇళ్లు పూర్తి చేసి పేదలకు పంపిణీ చేశారు. ఇక రెండోసారి హరిప్రియ ఎమ్మెల్యే. ఆమె హయాంలో 400 ఇళ్లు మంజూరయ్యాయి. నూటికి నూరు శాతం నిధులు, నిర్మాణాలు నీటి పాలయ్యాయి అంటున్నారు స్థానికులు. డబుల్ ఇళ్ల పథకం పునాదులు దాటలేదు. ఏ మండలంలో ఒక్క ఇల్లు కూడా పూర్తి చేయలేదు.

ఇల్లెందు పట్టణంలో 240 ఇళ్లు..

మున్సిపాలిటీలోని 24 వార్డులకు వార్డుకు 10 ఇళ్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల ముందు ఇళ్లు ఇస్తామని వార్డుల్లో ఓటర్లను ప్రలోభపెట్టారు. ఎన్నికలు ముగిసినా తరువాత ముఖం చాటేశారు. పట్టణంలోని హరిహర క్షేత్రం వద్ద 10 బ్లాక్‌లు 240 ఇళ్లకు ఆనాటి ఎమ్మెల్యే హరిప్రియ శంకుస్థాపన చేసింది. ఇసుక, సిమెంటు, నీటి సమస్యతో పునాదుల వరకు పనులు జరిగి నిలిచిపోయింది.

మండలానికి 60 ఇళ్ల కేటాయింపు...

ఇల్లెందు మండలానికి 60 ఇళ్లు కేటాయించారు. బొజ్జాయిగూడెంలో 20 ఇళ్లు, ఇందిరానగర్‌లో 20, మాణిక్యారంలో 20 ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మూడు చోట్లా స్థలం గుర్తించలేదు. ఒక్క ఇల్లు కూడా ప్రారంభం కాలేదు.

తొలిదశలో మూడు చోట్ల నిర్మాణం..

తొలి విడత ఇల్లెందుకు మంజూరైన డబుల్ బెడ్ రూం ఇళ్లు మూడు చోట్ల నిర్మించారు. నాలుగో చోట రొంపేడులో స్థలం లేక వదిలేశారు. ఇల్లెందుకు 80 ఇళ్లు మంజూరు కాగా సుదిమళ్ల పంచాయతీ లలితాపురంలో 20, రాఘబోయినగూడెం పంచాయతీ ముల్కనూరులో 20, చల్లసముద్రం గ్రామపంచాయతీ వేమలవాడలో 20 చేపట్టి పూర్తి చేశారు. రొంపేడు గ్రామపంచాయతీ 21 ఫిట్‌లో 20 ఇళ్లు చేపట్టేందుకు స్థలం లేక రద్దు చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి పథకం..

భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. స్థలం ఉన్న వారికి తొలిదశలో రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు కేటాయిస్తామని ప్రకటించారు. ఇక స్థలం లేని వారికి స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టి ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

రాజీవ్ గృహకల్ప కూడా దుర్వినియోగం...

పట్టణంలోని కొత్త కాలనీలో రాజీవ్ గృహకల్ప ఇళ్లు కూడా పిల్లర్లు, గోడలకే పరిమితం అయ్యాయి.



స్లాబ్‌లకే పరిమితం అయిన రాజీవ్ గృహకల్ప ఇళ్లు

పదేళ్ల కాలంలో ఏ అధికారీ ఈ రాజీవ్ గృహకల్ప ఇళ్లను పరిశీలించ లేదు. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రాజీవ్ గృహకల్ప ఇళ్లు అసంపూర్తిగా వదిలేశారు. మూడు బ్లాక్‌లుగా సుమారు 100 ఇళ్లు నిర్మించేందుకు మూడు అంతస్థుల నిర్మాణం చేశారు.ఈ రెండు రకాల ఇళ్ల నిర్మాణంతో ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయింది.

పేదలకు పక్కా ఇళ్లు ఇచ్చేదెప్పుడో...



ప్రభుత్వం మీద పేదలు ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. ఎంతో మంది ఉండటానికి ఇల్లు లేక కిరాయి ఇళ్లల్లో ఉంటూ అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పారు. ఇప్పటికైనా అర్హులైన పేదలకు పక్కా ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలి

– నరేష్‌గౌడ్, సుభాష్‌నగర్, ఇల్లెందు

రాజీవ్ గృహకల్పను పూర్తి చేయాలి..



రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రాజీవ్ గృహకల్ప ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించాలి. ఇళ్లు లేని పేదలు ఇంటి కిరాయిలు కట్టలేక అలమటిస్తున్నారు. ఇల్లెందులో అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లు, రాజీవ్ గృహకల్పను తక్షణమే పూర్తి చేసి పేదలకు అందించాలి.

– కాళంగి హరికృష్ణ, ఇల్లెందు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

జూలూరుపాడు: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం జూలూరుపాడులో ఆ సంఘం మండల అధ్యక్షుడు దిబ్బెందుల సాయికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నాయకుడు చంగల గురునాథం జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చాపలమడుగు రామ్మూర్తి, కాకటి కృష్ణ, నరసింహారావు, గార్లపాటి శివకృష్ణ, చంగల నరసింహారావు, సముద్రాల పవన్‌కుమార్, రంజిత్‌కుమార్, ఇసనపల్లి కల్యాణ్, పవన్, వెంకట్, నిఖిల్, వికాస్, నాగరాజు, వెంకట రామారావు, చంటి, గోపి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధనే అంతిమ లక్ష్యం...

పాల్వంచ: ఏబీసీడీ వర్గీకరణతోనే మాదిగలకు సముచిత న్యాయం దక్కుతుందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి సోమయ్య అన్నారు. ఎమ్మార్పీస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడారు. దామాషా ప్రకారం ఎస్సీ ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం అన్నారు. వంగూరి రామ్మూర్తి, దాసరి యాకయ్య, నల్లగట్ల తిరుపతయ్య, కేసుపాక నగేశ్, నాగరాజు, గంగరాజు, వెంకట్‌రావు, విష్ణు, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

టేకులపల్లి: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ 60వ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం టేకులపల్లి హరిజనవాడలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. సంఘం జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. నల్లగట్ల వెంకన్న, సురేష్, ఇస్తారి, పోలెపొంగు వెంకటేశ్వర్లు, నారపోగు దేవేందర్, జనక సత్యం, సీతారాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడు: జెండా ఆవిష్కరిస్తున్న గురునాథం



పాల్వంచ: జెండా ఆవిష్కరిస్తున్న సోమయ్య



టేకులపల్లి: హరిజనవాడలో...